సాక్షి
చిత్తూరు
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు డీఆర్‌వో రాజశేఖర్ తెలిపారు.
- 8లో



నలత..కలత

జిల్లాలో కళ్లకలక కలవరం రేపుతోంది. జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.
- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	24
తిరుపతి	34	25
తిరుమల	29	21
గూడూరు	36	26
నగరి	34	25

న్యూస్‌రీల్

ఇళ్ల పట్టాల పంపిణీకి భూ సేకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇళ్లపట్టాల పంపిణీకి భూసేకరణ వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయం నుంచి పలు శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఇళ్ల పట్టాలకు పలువురు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను గుర్తించాలని ఆదేశించారు. గుర్తించిన వారందరికీ 10 రోజుల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చేల భూ సేకరణ చేయాలని చెప్పారు. మండల, అర్బన్ ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువగా ప్రాంతాల్లో స్థల సేకరణ కసరత్తు చేయాలని ఆదేశించారు. గతంలో అందజేసిన పట్టాలల్లో గృహాలు నిర్మించకపోతే వాటిని రద్దు చేసి మరొకరికి పట్టాలు ఇవ్వాలన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌వో రాజశేఖర్, హౌసింగ్ పీడీ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మేలును ఎన్నటికీ మరువం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

చిత్తూరు కలెక్టరేట్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి అన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీస్‌ను రెగ్యులర్ చేస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించడం చారిత్రికమన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చిత్రపటానికి అసోసియేషన్ నాయకులు పాలాభిషేకం చేశారు. వేలాది మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల కుటుంబాల్లో ఆనందం నింపిన సీఎం మేలును జీవితాంతం గుర్తుపెట్టుకుంటామన్నారు. రెగ్యులర్ జూనియర్ లెక్చరర్‌ల అసోసియేషన్ మహిళా సెక్రటరీ హేమలత, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం నాయకులు అంబేడ్కర్, చిట్టిబాబు, శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను తగ్గించాలి

చిత్తూర్‌రూరల్: మాతా శిశుమరణాల శాతాన్ని తగ్గించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సూపర్ వైజర్లకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి సూచించారు. బుధవారం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జిల్లాలోని పీహెచ్‌సీ సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం జరిగింది. డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ తమ పరిధిలోని గర్భిణులను కాన్పుకు వారం ముందే ప్రభుత్వాస్పత్రికి చేర్పించాలన్నారు. రక్తహీనత ఉంటే ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లను ఇవ్వాలని తెలిపారు. తద్వారా సాధారణ కాన్పులు జరుగుతాయని తెలిపారు. కాన్పుల సమయంలో ఇబ్బందికర పరిస్థితి ఎదురైనప్పుడు పెద్దాస్పత్రికి రెఫర్ చేయాలని సూచించారు. పుట్టిన బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం తప్పనిసరని తెలిపారు. ఈనెల 30 నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను విజయవంతం చేయాలన్నారు. ఈసమావేశంలో ఎస్‌ఓ జార్జ్, హెచ్ఈఓ గుణశేఖర్, డీపీహెచ్‌ఎన్‌ఓ రేణుకప్రభ పాల్గొన్నారు.

ప్రతి టీచర్ డైరీ రాయాలి



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉపాధ్యాయులు తప్పనిసరిగా డైరీ రాయాలని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. రోజూ నోట్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని, తప్పులు ఉంటే సరిదిద్ది, సంతకంతో పాటు తేదీ తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజూ రెండు తరగతుల విద్యార్థుల నోట్స్‌లను తనిఖీ చేయాలని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా పీడీ, పీఈటీలు శిక్షణ ఇవ్వాలన్నారు. వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫార్మేటివ్ 2 పరీక్షలు అక్టోబర్ 3 నుంచి ప్రారంభం కానున్నట్లు చెప్పారు. ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నేరుగా అందుతాయని, అక్టోబర్‌లో తరగతులు ప్రారంభమవుతాయని డీఈవో విజయేంద్రరావు తెలిపారు.

కాణిపాకం పుణ్యక్షేత్రం బుధవారం ఎటు చూసినా ఆధ్యాత్మకను సంతరించుకుంది. స్వయంభు శ్రీవినాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల చివరి రోజు పలు సేవలు ఆద్యంతం శోభను సంతరించుకున్నాయి. ఉదయం త్రిశూల స్నానం సందర్భంగా భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి తన్మయులయ్యారు. అనంతరం వసంతోత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, యాగశాలలో ముగింపు పూజలు, రాత్రి వడాయత్తు ఉత్సవం, ఏకాంత సేవ కార్యక్రమాలు నయనానందకరంగా జరిగాయి.



పుష్కరిణిలో త్రిశూలానికి పవిత్ర స్నానం



ధ్వజావరోహణ పూజలు చేస్తున్న అర్చకులు

త్రిశూల స్నానం..

పులకించిన భక్తజనం

- ధ్వజావరోహణతో ముగిసిన బ్రహ్మోత్సవాలు
- శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం
- వేడుకగా వసంతోత్సవం, ఏకాంతసేవ

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజావరోహణంతో వైభవంగా పరిసమాప్తమయ్యాయి. ఉదయం ఆలయ పుష్కరిణిలో త్రిశూలానికి శాస్త్రోక్తంగా పవిత్ర స్నానం చేయించారు. తొలుత మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీసిద్ధి, బుద్ధి, సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను, త్రిశూలాన్ని పురవీధుల్లో ఊరేగించి, పుష్కరిణివద్దకు వేంచేపు చేశారు. యాగశాలలో ఏర్పాటు చేసిన 108 కలశాలలోని తీర్థాలను పుష్కరిణిలో కలిపారు. అనంతరం త్రిశూలానికి పవిత్ర స్నానం చేయించారు. ఈ సందర్భంగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు రంగు నీళ్ల చల్లుకుంటు కోలాహలంగా ఊరేగించారు. తదుపరి యాగశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పర్యవేక్షణ యాగమూర్తికి ముగింపు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో ప్రధాన సూత్రధారులుగా చేస్తూ ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుకు కట్టిన రక్ష బంధనాలను అర్చకులు శాస్త్రోక్తంగా తొలగించారు. సాయంత్రం ధ్వజావరోహణంలో భాగంగా ఆలయంలోని స్వర్ణ ధ్వజస్తంభానికి అభిషేక పూజలు నిర్వహించారు. దీపధూప నైవేద్యాలు సమర్పించారు. ధ్వజస్తంభంపై నుంచి మూషక చిత్రపటాన్ని శాస్త్రోక్తంగా అవరోహణ చేశారు.



బుధవారం రాత్రి ఏకాంత సేవలో స్వామివారికి హారతి



పూజల్లో పాల్గొన్న ఆలయ అధికారులు, భక్తులు

నేత్రానందంగా వడాయత్తు ఉత్సవం

రాత్రి స్వామివారికి వడాయత్తు ఉత్సవాన్ని నేత్రానందంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిగ్రహానికి అభిషేకం నిర్వహించి, పెసర పప్పు పాయసం, ఉద్ది వడలు నైవేద్యంగా సమర్పించి వడాయత్తు ఉత్సవాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. ఈసేవ స్వామి వారికి అత్యంత ప్రీతి పాత్రమైందని పురాణాలు చెబుతున్నాయి. అనంతరం స్వామివారికి ఏకాంతసేవను నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణలు చేశా రు. పాలు పండ్లు నైవేద్యంగా సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో అల సిన స్వామివారికి ఏకాంత సేవను భక్తి ప్రపత్తుల తో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓలు, సూపరింటెండెంట్‌లు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



వసంతోత్సవంలో ఆలయ సిబ్బంది, భక్తులు

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

- 30 నుంచి వైద్య శిబిరాల నిర్వహణ
- జిల్లాలో 478 క్యాంపులు
- జిల్లా నోడల్ అధికారి రవిరాజు

నగరి: జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరాల పక్కా నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం నగరిలోని అర్బన్ హెల్త్ సెంటర్లను మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఏఈ రమేష్‌తో కలసి తనిఖీ చేశారు. వైద్య శిబిరాల ఏర్పాటుపై చర్చించారు. అనంతరం రవిరాజు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో14, విలేజ్ క్లినిక్‌ల పరిధిలో 464 శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటికి తేదీలు నిర్ణయించడంతో పాటు శిబిరాల్లో పాల్గొనే స్పెషలిస్టులు, వైద్యులకు విధులను కూడా కేటాయించినట్లు పేర్కొన్నారు. వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వైద్య పరీక్షలు అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు.

స్పెషలిస్టులతో సేవలు

తొలుత వార్డు, గ్రామ వలంటీర్లు తమ పరిధిలో ఇంటింటి సర్వేలో వ్యాధిగ్రస్తులను గుర్తిస్తారని రవిరాజు తెలిపారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికీ వెళ్లి బీపీ, షుగర్, బ్లడ్‌లో హిమోగ్లోబిన్ పరీక్షలతో పాటు దగ్గుంటే గల్ల పరీక్ష, జ్వరం ఉంటే డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వ్యాధులతో బాధ పడేవారిని శిబిరాలకు తీసుకెళ్లి వైద్యచికిత్సలు అందిస్తారని పేర్కొన్నారు. ఇతర జిల్లాలో లేని విధంగా చిత్తూరులో పల్స్ ఆక్సీ మీటర్‌లతో ఆక్సిజన్ లెవల్స్, పల్స్, థర్మల్‌గన్స్‌తో టెంపరేచర్ కూడా లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. రూ.25 లక్షల విలువజేసే పల్స్ ఆక్సీమీటర్లు దాతల సాయంతో సమకూర్చామని తెలిపారు. అందరికీ వైద్య పరీక్షలు చేయడం అన్నది ప్రపంచంలో ఇదే ప్రథమమన్నారు.



పల్స్‌ఆక్సీమీటర్లు అందజేస్తున్న డాక్టర్ రవిరాజు

నేడు కరెంటు బిల్లులు చెల్లించవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో గురువారం ప్రభుత్వం సెలవు అయినప్పటికీ విద్యుత్తు కేంద్రాలు పనిచేస్తాయని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. విద్యుత్ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని, వినియోగదారులు బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు.


ప్రజల ఆరోగ్య భద్రతపై ఎన్నడూ లేని విధంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వర్షాలు..మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలను ముమ్మరం చేసింది. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయి నుంచి అధికారులు సమన్వయంతో పనిచేసేలా.. అవగాహన కార్యక్రమాలు, దోమల నివారణా చర్యలను వేగవంతం చేసింది. ప్రధానంగా సురక్షిత మంచినీటిని సరఫరా చేసేలా నిబంధనల మేరకు ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసేలా అధికారులను ఆదేశించింది.

ప్రజారోగ్యానికి భద్రత

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- గ్రామీణ పారిశుద్ధ్యానికి పెద్దపీట
- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన
- నిర్ణీత సమయంలో వాటర్ ట్యాంక్‌ల క్లీనింగ్
- దోమల నివారణకు ఫాగింగ్



చిత్తూరులో పారిశుద్ధ్య చర్యలు



సాక్షి, చిత్తూరు: జిల్లాలో వరుస వర్షాలు..మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా జిల్లా అధికారులు ముందస్తు చర్యల్లో నిమగ్నమయ్యారు. వర్షాల ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడకుండా సరైన చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ప్రజలను, ప్రభుత్వ విభాగాల సిబ్బందిని ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేశారు. వలంటీర్లు సచివాలయ సిబ్బంది పారిశుద్ధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో వలంటీర్లు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం కింద ఇంటింటి సర్వేలో వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నారు. చిన్నపాటి వ్యా ధులకు పరీక్షలు నిర్వహించిన మందులు ఇస్తున్నారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు జగనన్న ఆరో గ్య సురక్ష వైద్య శిబిరాల్లో స్పెషలిస్టులతో వైద్య సేవలు అందించనున్నారు. ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య పరీక్షలకు సంబంధించిన పరికరాలు, మందులు చేరుకున్నాయి.

నీటినిల్వలు లేకుండా..

పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పారిశుద్ధ్య లోపం, కలుషిత నీటి కారణంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయని అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నారు. గృహ పరిసర ప్రాంతాలు, రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ రోగాలు ప్రబలకుండా ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారు. జిల్లాలోని 3,149 రక్షిత మంచినీటి ట్యాంకులున్నాయి. నిబంధనల మేరకు 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేసే విధంగా చర్యలు ప్రారంభమయ్యాయి.

మలేరియా, డెంగీపై ముందస్తు చర్యలు

ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో రెండు మలేరియా కేసులు, 134 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధులు ప్రబలకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. దోమల నివారణకు జిల్లాలోని 697 గ్రా మ పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు పంపిణీ చేసింది. దోమల్ని లార్వా దశలోనే నివారించే అబేట్, పెద్ద దోమలను చంపే సైఫునోత్రిన్ వంటి మందులను కూడా సరఫరా చేసింది. క్షేత్రస్థాయిలో చెత్త నిల్వ లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాలతో పాటు పిడుగులు పడే సమయంలో ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

వర్షాలతో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాం. ట్యాంకుల నుంచి సురక్షిత నీటిని సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశాం. గృహ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, లావా ఉత్పత్తి కాకుండా తగిన మందులను పిచికారీ చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై అవగాహన కా ర్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశాం.

– లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

వ్యాధుల నివారణకు చర్యలు

జిల్లాలో వర్షాల ప్రభావంతో వ్యాధులు ప్రబలకుండా చర్యలు ప్రారంభించాం. సచివాలయాల సిబ్బంది తమ పరిధిలో నీటి నిల్వలు లేకుండా తొలగించాలని.. పరిశుభ్రత చర్యలు చేపట్టాలని..వాటర్ ట్యాంకులను నిబంధనల మేరకు తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేయడంతోపాటు పర్యవేక్షిస్తున్నాం. ప్రతి పంచాయతీకి ఫాగింగ్ యంత్రాలను పంపిణీ చేశాం. సచివాలయ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రజారోగ్యానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు చేపట్టాం.



షణ్మోహన్, కలెక్టర్

ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

● 600 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే అదనపు కేంద్రం ● డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల నిబంధనలు పాటిస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు పకడ్బందీ కసరత్తు చేస్తున్నట్లు డీఆర్‌వో రాజశేఖర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ గత వారం రోజులుగా ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులకు 3,796 దరఖాస్తులు వచ్చాయన్నారు. అక్టోబర్ 17న పోలింగ్ కేంద్రాల జాబితా, అక్టోబర్ 27న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఉంటుందని తెలిపారు. వారం రోజులుగా జిల్లాలో ఓటర్ల జాబితా మార్పులు చేర్పులకు సంబంధించి పకడ్బందీ కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఫామ్ 6కు 1,715, ఫామ్-7కు 790, ఫామ్-8కి 1,291 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఒకే ప్రదేశంలో 600 మందికి పైగా ఓటర్లు ఉన్నట్లయితే ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 29వ తేదీ లోపు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటర్ల తొలగింపునకు సంబంధించి తప్పుడు సమాచారం ఇస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పలు పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, గంగరాజు, నాగరాజన్, పరదేశి, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ప్రత్యేక గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న అశోకరాజు

నారాయణవనం: వ్యక్తిగత నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుని, ప్రత్యేక గుర్తింపును పొందే అవకాశం వృత్తి విద్యతోనే సాధ్యమని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు తెలిపారు. బుధవారం సిద్ధార్థ ఇంజినీరింగ్ టెక్నాలజీ, సిద్ధార్థ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలల్లో ఫస్టియర్ బీటెక్ విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. అశోకరాజు మాట్లాడుతూ పిల్లలను తమ కళాశాలలో చేర్పిన తల్లిదండ్రుల నమ్మకానికి అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని సూచించారు. కళాశాలలో కల్పించిన మెరుగైన సాంకేతిక సౌకర్యాలు, అత్యాధునిక ల్యాబ్, లైబ్రరీని వినియోగించుకోవాలని కోరారు. మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందడానికి ఇంక్యుబేషన్ సెంటర్ సైతం అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధనరాజు, రమేష్, గుణప్రసాద్ పాల్గొన్నారు.

- పలమనేరు గురుకుల బాలికల సంక్షేమ హాస్టల్‌లో ఇటీవల 60 మందిపైగా విద్యార్థులకు కళ్ల కలక (మెడ్రాస్ ఐ) వ్యాపించింది. స్థానిక ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అందరికీ మందులు అందించారు. దీంతో కేసులు తగ్గుముఖం పట్టాయి.
- చిత్తూరు మండలం గువ్వకల్లు గ్రామంలో ఒకే కుటుంబంలో ఇద్దరికి కళ్లకలక వ్యాపించింది. అలా గ్రామంలో పలువురికి వ్యాప్తి చెందింది. గ్రామంలో 25 కేసులు ఉన్నాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వీటి బారిన పడుతున్నారు.



నలత.. కలత

- విజృంభిస్తున్న కళ్ల కలక... ● వాతావరణ మార్పులతో వైరస్ వ్యాప్తి
- గ్రామాల్లో అధిక సంఖ్యలో కేసులు నమోదు ● విద్యా సంస్థలను కలవరపెడుతున్న కలక
- రోజూ 400కు దాటుతున్న ఓపీ ● జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు

జిల్లాలో వర్షాలు, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఓవైపు వైరల్ ఫీవర్ దడపుట్టిస్తుండగా.. మరోవైపు కళ్లకలక కలకలం రేపుతోంది. కలక ఉన్న వారి కళ్లలో చూస్తే తక్కున వ్యాపిస్తోంది. గ్రామాల్లో శరవేగంగా వ్యాప్తి చెందుతోంది. చిన్న పెద్ద తేడా లేకుండా వ్యాప్తి చెందుతోంది. విద్యాసంస్థల్లో కూడా కేసులు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులకు రోజూ 400పైగా ఓపీలు వస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. సరిహద్దులోని బెంగళూరులో కేసులు విలాయతాండవం చేస్తుండడంతో జిల్లాను చుట్టిముట్టేస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. జిల్లాలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఒకటి, ఏరియా ఆస్పత్రులు 4, సీహెచ్‌సీలు 7, పీహెచ్‌సీలు 50, ప్రైవేటు ఆస్పత్రులు 2వేల దాకా ఉన్నాయి. ఈఆస్పత్రులకు సాధారణ ఓపీలు 7వేలు దాటుతోంది. వాతావరణ మార్పులతో కండ్ల కలక విజృంభిస్తోంది. ఇది సాధారణ కంటి జబ్బు అయినా మొదట్లోనే దీన్ని నివారించుకోవాలని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.. పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు పాటిస్తే చాలని సూచిస్తున్నారు.

– చిత్తూరు రూరల్

ఎలా వస్తుంది

- కళ్ల కలక వైరస్ లేదా బాక్టీరియా, అలర్జీ కారణంగా వస్తుంది.
- వైరస్, బాక్టీరియాతో వచ్చే కలక ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతాయి.
- గుంపులుగా ఉండే ప్రదేశాల్లో అధికంగా వ్యాప్తి చెందేందుకు అవకాశాలున్నాయి.
- అలర్జీతో కలిగే కలక ఆ వ్యక్తి రోగ నిరోధక వ్యవస్థ మీద ఆధారపడి ఉంటుంది.
- వైరస్ లేదా అలర్జీ వల్ల కలిగే కలక తక్కువ సమయంలో తీవ్రమైన లక్షణాలతో వస్తుంది. అంతే వేగంగా తగ్గిపోతుంది.
- బాక్టీరియాతో వచ్చే కలక కొన్ని రోజుల వ్యవధిలో పెరుగుతుంది. కళ్ల మీద అధిక ప్రభావం ఉంటుంది.
- కంటి చూపు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కొన్ని సార్లు రసాయనాల వల్ల కలక రావచ్చు.
- అప్పుడు శుభ్రమైన నీటితో కళ్లను శుభ్రం చేసుకుంటే తగ్గిపోతుంది.
- చిన్న పిల్లల్లో జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- కండ్ల కలకకు కారణమైన వైరస్‌తో సాధారణ జలుబు కూడా వస్తుంది.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కళ్ల కలక కేసులు

తేదీ	సంఖ్య
24	438
25	451
26	391
27	443



లక్షణాలు..

- కన్ను ఎర్రగా మారుతుంది
- కంటి నుంచి నీరు కారుతుంది
- కంటి రెప్పలు వాపు, ఉబ్బుతాయి.
- నిద్రించినప్పుడు కంటి రెప్పలు అతుక్కు పోతాయి.
- కంటి నుంచి పుసి వస్తుంది
- కంటి నొప్పి దురద, మంట వస్తుంది.
- ఎక్కువ వెలుతురు చూడలేక పోతారు
- కళ్ల నుంచి నీరు లేక చిక్కటి స్రావం కారుతుంది
- బాక్టీరియాతో కలిగే కలకతో చీము వచ్చే అవకాశం కూడా ఉంటుంది

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మన పరిసరాల్లో ఎవరికైనా కళ్ల కలక ఉంటే వారికి దూరంగా ఉండాలి.
- వారు వాడిన వస్తువులు (టవల్స్, సబ్బులు, ఇతర వస్తువులు) తాక కూడదు. వాడకూడదు. తప్పని పరిస్థితుల్లో తాకితే తరచూ చేతులను నీటితో శుభ్రం చేసుకోవాలి. కళ్ల కలక వస్తే తప్పని సరిగా అద్దాలు ఉపయోగించాలి.
- కళ్లను మంచి నీటితో శుభ్రం చేస్తే అరికట్టొచ్చు. పరిస్థితి తీవ్రతను బట్టి కంటి వైద్యులను సంప్రదించాలి.

చికిత్స

యాంటీ బయోటిక్ 'ఐ' డ్రాప్స్, లుబ్రికాటింగ్ 'ఐ' డ్రాప్స్ వేసుకోవాలి

సీజనల్ ప్రభావం..



ఇన్‌ఫెక్షన్ ఉన్న వ్యక్తి నుంచి ఆ వైరస్ ఇతర వ్యక్తులకు కంటి స్రావాలు, చేతుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఒక వ్యక్తి ముక్కులో లేదా సైనస్‌లో ఉండే వైరస్, బాక్టీరియా ఇతరు కళ్లలోకి చేరడం ద్వారా ఇన్‌ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. కాంటాక్టు లెన్స్ వినియోగించే అలవాటు ఉన్నవారు వాటిని సక్రమంగా శుభ్రం చేసుకోవాలి. సరైన లెన్స్ వాడకపోడం వల్ల కూడా కలక రావచ్చు.

–డాక్టర్ మాధవి, కంటివైద్య నిపుణులు (జిల్లా మేనేజర్,కంటి వెలుగు)

వైద్యులను సంప్రదించాలి.



ఈ లక్షణాలు కనిపించినప్పుడు కళ్లు చేతులతో నలపకూడదు. శుభ్రమైన టిష్యూ పేపర్ లేదా చేతి రుమాలుతో కళ్లు తరచూ తుడుచుకోవాలి. నల్లటి అద్దాలు పెట్టుకోవడం ద్వారా నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. వైరస్ వల్ల కలిగే సమస్య ఒకటి రెండు వారాల్లో తగ్గిపోతుంది. బాక్టీరియాతో సమస్య ఏర్పడితే సరైన మందును తగిన మోతాదులో తీసుకోవాలి. చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. డాక్టర్లను సంప్రదించాలి.

–డాక్టర్ రవిరాజు, వైద్య నిపుణులు



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75.00

పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం
- చిత్తూరులో 2 కే రన్


రన్‌లో పాల్గొన్న డీఆర్‌ఓ రాజశేఖర్, మేయర్ అముద

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకరంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని, డీఆర్‌ఓ రాజశేఖర్, నగర మేయర్ అముద అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద 2కే రన్‌ను మేయర్ జెండా ఊపి ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. కాణిపాకం ఆలయం, చిత్తూరు ఫారెస్ట్, భూమిరెడ్డిపల్లె, కలవగుంట రిజర్వాయర్లను ప్రాధాన్యతగా భావించి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. డీఆర్‌వో రాజశేఖర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ప్రాచీన సంపదలకు నిలయని పేర్కొన్నారు. జిల్లాలో కాణిపాక ఆలయం తో పాటు బోయకొండ గంగమ్మ ఆలయానికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తున్నారని, కుప్పంలోని ననియాల ప్రాజెక్టు, రాజులకోట, కైగల్ వాటర్ ఫాల్స్ వంటి ప్రాంతాలు ఎంత గానో ప్రసిద్ధి చెందాయన్నారు. ఇవి మన ప్రాచీనుల సంపద, సంస్కృతులకు చిహ్నంగా నిలిచాయని తెలిపారు. ఆ పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రాచుర్యం కల్పించి పర్యాటకులకు ఆకర్షించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. నగరపాలక కమిషనర్ అరుణ మాట్లాడుతూ ప్రాచీన సంపదను కాపాడుకోవడంతోపాటు వాటి విశిష్టతను అందరికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గాంధీవిగ్రహం నుంచి అంబేడ్కర్‌భవనం వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువజన అధికారి ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా నూతన కమిటీ

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి జిల్లా నూతన కమిటీని ప్రకటించినట్లు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్(పూతలపట్టు), బ్రహ్మానందరెడ్డి(చిత్తూరు), కైలాసం(నగరి), మణివర్మ(జీడీనెల్లూరు), లక్ష్మివర్మ(నగరి), అరుణ(జీడీనెల్లూరు), ప్రధాన కార్యదర్శులుగా వెంకటముని(చంద్రగిరి), శ్రీనివాసులు(చిత్తూరు), తులసీనాథ్(కుప్పం), రమేష్‌నాయుడు(నగరి), కార్యదర్శులుగా బాబు(నగరి), జీకే చౌదరి(జీడీనెల్లూరు), ప్రభాకర్(పలమనేరు), శ్రీధర్‌బాబు(చంద్రగిరి), చిట్టిబాబు(చిత్తూరు), హరినాథరెడ్డి(చంద్రగిరి), కోశాధికారిగా హరినాయుడు(జీడీనెల్లూరు)ను నియమించినట్లు పేర్కొన్నారు. వీరు రెండు సంవత్సరాల పాటు పదవీలో ఉంటారని, పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

● ఇద్దరు నిర్వాహకుల అరెస్ట్ ●రూ.1.40 లక్షల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు, నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ రాఘవరెడ్డి

పుంగనూరు: యువకులను చెడు అలవాట్లకు బానిసులను చేసేందుకు కొంత మంది చేస్తున్న కుట్రలను బుధవారం పోలీసులు తిప్పికొట్టారు. జూదం కేంద్రంపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 1.40 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాళ్యంపల్లె సమీపంలో కర్ణాటకకు చెందిన అరుణ్ కుమార్, దేవప్పతో పాటు పుంగనూరు, రామసముద్రం, మదనపల్లె ప్రాంతాలకు చెందిన కొంతమంది మంగతాయి జూదం నిర్వహిస్తున్నారు. వీరితో మదనపల్లెకి చెందిన అర్జున్‌రెడ్డి, పుంగనూరు మండలం పెద్దతాండాకు చెందిన బాలాజీనాయక్, రామసముద్రం మండలం అరటికాయలరాజా ప్రతి రోజూ సమావేశమై ఫోన్ల ద్వారా సమాచారం అందిస్తూ, మంగతాయి జూదం నిర్వహిస్తూ రూ.లక్షలు మోసం చేస్తున్నారు. సమాచారం మేరకు సీఐ రాఘవరెడ్డి, ఎస్‌ఐలు సుకుమార్, మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పాళ్యంపల్లె జూదం కేంద్రంపై దాడి చేశారు. ఈ సమయంలో సుమారు 15 మంది పరారీ కాగా, అరుణ్ కుమార్, దేవప్ప పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.1.40 లక్షలు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఎక్కడైన పేకాట, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు.

చీటీల పేరిట రూ.లక్షల మోసం

పలమనేరు: పలమనేరు మండలంలోని తొప్పనపల్లెలో చీటీల పేరిట ఏజెంట్ మోసం చేశాడని, తమకు న్యాయం చేయాలని పలువురు బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. తొప్పనపల్లెలో పలువురు చీటీలను నిర్వహిస్తున్నారు. దాదాపు రూ.3 కోట్ల వరకు చీటీల వ్యాపారం సాగుతున్నట్లు సమాచారం. గ్రామానికి చెందిన హేమగిరి ఏజెంట్‌గా వ్యవహరిస్తూ చీటీలను నిర్వహించాడు. 36 నెలలు చీటీలు కట్టించుకుని, పాట పాడిన వారికి డబ్బులివ్వడం లేదు. దీనిపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నాడని బాధితులు సుబ్రమణ్యం శెట్టి, సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారిస్తున్నట్లు ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. బాధితులు చాలామంది ఉన్నారని పేర్కొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

ఉరేసుకుని విద్యార్థి దుర్మరణం


రాజు(ఫైల్)

గుడిపాల: పాఠశాలకు సరిగ్గా వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో 9వ తరగతి బాలుడు బుధవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. ఏఎస్‌ఐ చలపతి కథనం మేరకు వివరాలు.. బొమ్మసముద్రం దళితవాడకు చెందిన రాజేష్ కుమారుడు రాజు(14) బొమ్మసముద్రం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సరిగ్గా వెళ్లక పోతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా డాక్టర్ పరీక్షించి, చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

భవ్యశ్రీ కుటుంబానికి ప్రభుత్వం అండ


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం) : పెనుమూరు మండల పరిధిలోని ఠాణా వేణుగోపాలపురంలో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన భవ్యశ్రీ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు యశోదారెడ్డి అన్నారు. బుధవారం ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదేశాల మేరకు నాయకులతో కలసి బాధిత కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవ్యశ్రీ మృతి ఘటన అందరినీ కలచి వేసిందన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ జరుగుతుండడంతో ఉప ముఖ్యమంత్రి రాలేక పోయారని, ఈ ఘటనపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీస్ ఉన్నత అధికారులకు ఆదేశిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు పూర్తి అయిన వెంటనే ఉప ముఖ్యమంత్రి నేరుగా వచ్చి బాధిత కుటుంబంతో మాట్లాడుతారన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎద్దల మల్లికార్జున్‌రెడ్డి వారికి ఆర్థిక సాయాన్ని అందించారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పండరినాథ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు దాము, జిల్లా కార్యవర్గ సభ్యుడు దూదిమోహన్, నాయకులు నవీన్‌కుమార్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు మీన తదతరులు పాల్గొన్నారు.

పలు బీసీ సంఘాల నాయకుల పరామర్శ

భవ్యశ్రీ కుటుంబాన్ని పలు బీసీ సంఘ నాయకులు పరామర్శించారు. వడ్డెర సంఘం చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు డీవీఎస్ మణి, తురకా అమర్నాథ్, సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు కుమారి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్లు మొగిలీశ్వర్, పెద్దన్న, బీసీ సంఘర్షణ సమితి గౌరవాధ్యక్షుడు లక్ష్మయ్య, పలువురు బీసీ సంఘం నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఇంజెక్షన్ వికటించి ఐదు నెలల చిన్నారి మృతి

- ఏ ఇంజెక్షన్ ఇచ్చానో తెలియదంటున్న వైద్యుడు
- ఫిర్యాదు స్వీకరించని తమిళనాడు పోలీసులు
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన


మృతి చెందిన చిన్నారి ప్రీతి, ప్రీతి (ఫైల్)

శ్రీరంగరాజపురం: తమిళనాడుకు చెందిన ఓ ప్రయివేటు ఆస్పత్రి వైద్యుడు ఇచ్చిన ఇంజెక్షన్ వికటించి ఐదు నెలలు తమ చిన్నారి మృతి చెందిందని చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం సీకే పురం గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్, లోకేశ్వరి ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సీ.కే.పురం గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్, లోకేశ్వరి దంపతుల కుమార్తె ప్రీతి(5) జ్వరం, జలుబుతో బాధపడుతుండగా చికిత్స కోసం సోమవారం గ్రామానికి సమీపంలోని తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సోముశేఖర్ నాయుడు క్లినిక్‌కు తీసుకెళ్లారు. డాక్టర్ సోముశేఖర్ పరీక్షించి ఇంజెక్షన్ వేయాలని చెప్పారు. ఇంజక్షన్ వద్దు మందులు రాసివ్వమని ఎంత చెప్పినా, డాక్టర్ వినకుండా తప్పదని ఇంజెక్షన్ వేశారు. ఆ ఆస్పత్రిలో ఉండగానే చిన్నారి శరీరం రంగు మరిపోయింది. వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అధిక మోతాదులో ఇంజెక్షన్ ఇవ్వడంతో చిన్నారి గుండెలో రక్తం గడ్డ కట్టిందని తెలిపారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సిఫార్సుల మేరకు తిరుపతి రుయా చిన్న పిల్లల ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందిస్తుండగా మంగళవారం సాయంత్రం చిన్నారి కన్నుమూసింది.

ఏం చేసుకుంటారో చేసుకోండి

బాధిత కుటుంబ సభ్యులు బుధవారం పళ్లిపట్టులోని వైద్యుడి వద్దకు వచ్చి ప్రశ్నించగా.. 'నాకు మతిమరుపు ఎక్కువ. నేను ఏ మందు ఇచ్చానో నాకే తెలియడం లేదు. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి' అని ఆస్పత్రి నుంచి తరమగొట్టారు. వెంటనే వారు పళ్లిపట్టులోని పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తే, స్వీకరించకపోగా గెంటివేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు స్టేషన్ బయట ధర్నాచేశారు. వైద్యుడి నుంచి పోలీసులు లంచాలు స్వీకరించి, తమ ఫిర్యాదు సీకరించలేదని ఆరోపించారు. చిన్నారి మృతి కారణమైన వైద్యుడిని శిక్షించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్ : పెనుమూరు మండలం మండలం ఉగ్రణంపల్లెలో బుధవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. శివ కోటిరెడ్డి అనే వ్యక్తి నుంచి 300 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్టు చూపించి రిమాండ్‌కు తరలించారు. ఈదాడిలో సీఐ జోగేంద్ర, ఎస్‌ఐ బాబు, సిబ్బంది శంకర నాయక్, జయ శంకర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.